నమస్తే తెలంగాణ

# మెదక్

13 | హైదరాబాద్, ఆదివారం 28 జనవరి 2024 | MEDAK


# నేడు 'మల్లన్న' లష్కర్ వారం

- భారీగా తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



పూజలందుకుంటున్న కొమురవెల్లి మల్లన్న

చేర్యాల, జనవరి 27: సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మల్లన్నక్షేత్రానికి భారీగా భక్తులు తరలివస్తున్నారు. స్వామి వారి ఉత్సవాల్లో భాగంగా రెండో ఆదివారానికి (లష్కర్) సికింద్రాబాద్ భక్తులతో పాటు కరీంనగర్, మెదక్, వరంగల్ ఉమ్మడి జిల్లాలకు చెందిన వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకోనున్నారు. సికింద్రాబాద్ భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మల్లన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకోనుండడంతో రెండో ఆదివారానికి లష్కర్‌వారంగా పిలుస్తున్నారు. శనివారం సాయంత్రానికి భక్తులు ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల ద్వారా మల్లన్న క్షేత్రానికి చేరుకొని మల్లన్నను ధూళిదర్శనం చేసుకున్నారు. లష్కర్ వారం సందర్భంగా భక్తులు మల్లన్నకు పట్నం వేసి, బోనం సమర్పించడంతో పాటు అమ్మవార్లకు ఒడిబియ్యం, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నట్లు ఆలయ ఈవో ఏ.బాలాజీ, చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి తెలిపారు. లష్కర్‌వారాని వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పించామని, ఎలాంటి ఇబ్బందులు ఉన్నా ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని వారు సూచించారు.

## నేడు మెదక్ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

**హాజరుకానున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి**

మెదక్, జనవరి 27 (నమస్తే తెలంగాణ): మెదక్ నియోజకవర్గ బీఆర్ఎస్ విస్తృత స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు మెదక్ పట్టణంలోని వైస్రాయ్ గార్డెన్‌లో ఏర్పాటు చేయడం జరిగిందని మెదక్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మా దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి హాజరుకానున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, పట్టణ, మండల అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు, పట్టణ, గ్రామ కమిటీ, అనుబంధ కమిటీ అధ్యక్షులు, సభ్యులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆమె పిలుపునిచ్చారు

# నైపుణ్యం ఉంటేనే ఉపాధి అవకాశాలు



మెదక్ జాబ్ మేళాలో వివిధ కంపెనీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 27: నైపుణ్యం ఉంటేనే ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని మెదక్ కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మెదక్ వైస్రాయ్ గార్డెన్‌లో శనివారం జాబ్‌మేళాకు ఆయన హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగులకు జాబ్‌మేళా ఒక వరమన్నారు. ఇతర దేశాల్లోని వారు ఇంటర్ తర్వాత వారి నైపుణ్యంతో ఉద్యోగాలు సంపాదించుకుంటున్నారని గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి మండలంలో ఒక ఇంటర్నేషనల్ స్కూల్, రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం వివిధ సంస్థలు ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆయన పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు జిల్లా యువజన, క్రీడల అధికారి నాగరాజు మాట్లాడుతూ యువజన సర్వీసులశాఖ చైర్మన్ సాబ్యసాచి ఆదేశానుసారం కలెక్టర్ అనుమతితో యువతీ యువకులకు మెగా జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. జాబ్‌మేళాలో రాష్ట్రంలోని 70 కంపెనీల ప్రతినిధులు 4వేలమంది, జిల్లాకు చెందిన 600 మందికి పైగా నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారన్నారు. వీరిలో 52 మంది ఎంపిక కాగా 165 మంది ప్రాసెస్‌లో ఉన్నారన్నారు. జాబ్‌మేళాలో ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్ శ్రీనివాస్, ఆయా కంపెనీల హెచ్‌ఆర్‌వోలు పాల్గొన్నారు.

# భవిష్యత్ బీఆర్ఎస్‌దే..

- ప్రభుత్వం రానందుకు బాధపడాల్సిన పనిలేదు
- పూలబాటలు, ముళ్ల బాటలను చూశాం
- తెలంగాణ ఉద్యమంలో ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొన్నాం
- కాంగ్రెస్ అబద్ధాలను ప్రచారం చేసింది
- కొన్ని యూట్యూబ్ చానళ్లు కొంపముంచాయి

**బీఆర్ఎస్ కన్నతల్లిలాంటిది.. పార్టీ కోసం పనిచేయాలి**

**మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు**

**సిద్దిపేట నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల కృతజ్ఞతసభలో క్యాడర్‌కు భరోసా**



సిద్దిపేట బీఆర్ఎస్ కృతజ్ఞత సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, జనవరి 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ''బీఆర్ఎస్ పూల బాటలు చూసింది...ముళ్ల బాటలు చూసింది..విజయాలు..అపజయాలు చూశాం. దురదృష్టవశాత్తు బీఆర్ఎస్ ప్రభుత్వం రాలేదు. అంత మాత్రాన మనం బాధపడాల్సిన అవసరం లేదు. భవిష్యత్ మళ్లీ బీఆర్ఎస్‌దే'' అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కొండభూదేవి గార్డెన్‌లో శనివారం బీఆర్ఎస్ సిద్దిపేట నియోజకవర్గ కార్యకర్తల కృతజ్ఞత సభ జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలు గొప్పవాళ్లు ..వాళ్ల తీర్పును మనం గౌరవించాలన్నారు. కేసీఆర్ తెలంగాణ ఉద్యమంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నారని, కొన్ని సార్లు గెలిచాం..కొన్నిసార్లు ఓడిపోయామన్నారు. ఇంత అద్భుతమైన గెలుపు అందించిన మీ అందరికీ కృతజ్ఞత చెప్పాలనే ఉద్దేశంతో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. వాస్తవంగా మొన్నటి ఎన్నికల్లో రాష్ట్రం మొత్తంలో 1.8 శాతం మాత్రమే మనకు ఓట్లు తక్కువ వచ్చాయన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో మీటింగ్ జరిగిందని, పలు సూచనలు చేశారన్నారు. కొన్ని పథకాలు మనకు ఇబ్బంది కలిగించాయన్నారు.

**బీఆర్ఎస్ కన్నతల్లిలాంటిది..**

బీఆర్ఎస్ కన్నతల్లి లాంటిది...మన మధ్య భేదాభిప్రాయాలు ఉంటే కూర్చుండి మాట్లాడుకోవాలి తప్పా.. పార్టీకి నష్టం చేకూర్చే విధంగా ఉండవద్దని హరీశ్‌రావు అన్నారు. పార్టీ ఉంటేనే మనందరికీ గౌరవం ఉంటుందన్నారు. పార్టీ కోసం పని చేయాలి..ఎక్కడ కూడా డీలా పడవద్దన్నారు. ఉద్యమంలో ఎలా కొట్లాడినామో అలా ముందుకుపోవాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఎవరైనా మొన్న సిద్దిపేటలో వచ్చిన మెజార్టీ కంటే పదిరెట్లు ఎక్కువ రావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడేది కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కాదు.. అది బీఆర్ఎస్ మాత్రమేనని గుర్తుచేశారు.





సిద్దిపేటలోని కొండభూదేవి గార్డెన్‌లో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల కృతజ్ఞత సభ వేదికపైన పార్టీ నాయకులు



సిద్దిపేటలో జరిగిన బీఆర్ఎస్ కృతజ్ఞత సభకు హాజరైన నాయకులు, కార్యకర్తలు

**కాంగ్రెస్ అబద్ధాలను ప్రచారం చేసింది..**

తెలంగాణ రాకముందు కరెంట్, సాగు, తాగునీరు, పండిన పంటల పరిస్థితి..ఇవాళ పరిస్థితి ఎలా ఉందో ఒకసారి ఆలోచన చేయాలని హరీశ్‌రావు సూచించారు. కాంగ్రెస్ నాయకులు అబద్ధాలను ప్రచారం చేశారన్నారు. కాంగ్రెస్ తీరు ఎలా ఉంది అంటే ఆనాడు ప్రచారంలో అబద్ధాలు ...నేడు పాలనలో అసహనం..ఎన్నికల ప్రచారంలో గ్లోబెల్ ప్రచారం చేశారని విమర్శించారు.ఆనాడు దావోస్‌కు పోతే దండగ అన్నారు, తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఎలా పోయారని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు.

**కొన్ని యూట్యూబ్ చానళ్లు కొంపముంచాయి..**

నిజం నిలకడగా ఉంటుంది. మనల్ని కొన్ని యూట్యూబ్ చానళ్లు కొంప ముంచాయని హరీశ్‌రావు అన్నారు. నిజం గడప దాటక ముందే అబద్ధం ఊరంతా చుట్టి వస్తుందన్నారు. మనం చేసిన మంచి పనులు చెప్పుకోవడంలో వెనుకబడిపోయామన్నారు. ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు, వైస్ రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య ఇలా ఎంతో మంది ముఖ్యమంత్రులు మారారు కానీ సిద్దిపేట జిల్లా ఏర్పాటు కాలేదన్నారు. దశాబ్దాల కల కేసీఆర్ వల్ల సాధ్యమైందన్నారు. ఒక్క సిద్దిపేటనే కాకుండా 33 జిల్లాలు ఏర్పాటు చేసుకున్నామన్నారు. పరిపాలనను ప్రజల వద్దకు తీసుకువెళ్లామన్నారు. 60 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో కానటువంటి పనులను కేసీఆర్ పదేండ్లలో చేసి చూపించారన్నారు. ఇప్పుడు అద్భుతమైన పంటలు పండుతున్నాయన్నారు. కాంగ్రెస్ ఎన్ని హామీలిచ్చిందో మీఅందరికీ తెలుసన్నారు. అధికారంలోకి రాగానే డిసెంబర్ 9న మొదటి సంతకం రెండు లక్షల రుణ మాఫీ అని చెప్పారు.మరి అయిందా..? కాంగ్రెస్ వాళ్లు ఏరకంగా ప్రజలను మోసం చేశారో అర్థమవుతుందన్నారు. రైతు బంధు గురించి అడిగితే మంత్రులు తలో రకంగా ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సమావేశంలో సిద్దిపేట జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ, రాష్ట్ర నాయకుడు రాధాకృష్ణశర్మ, నాయకులు రాజనర్సు, సంపత్‌రెడ్డి, సాయిరామ్, నాగిరెడ్డి, వివిధ మండలాల ముఖ్యనేతలు, పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యువత, విద్యార్థి, మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

# నిమ్జ్ బాధితులను ఆదుకోవాలి

- పేదల రేకుల షెడ్లు, ప్రహరీ కూల్చివేయడం దారుణం
- కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించిన అధికారులు
- జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు
- ఘటనా స్థలం పరిశీలన, బాధితులకు భరోసా



కూల్చివేతలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

ఝరాసంగం, జనవరి 27 : సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండల పరిధిలోని ఎల్గోయి, బర్దిపూర్, చిలేపల్లి గ్రామాల్లో జాతీయ పెట్టుబడుల ఉత్పాదక మండలి (నిమ్జ్) ప్రాజెక్ట్ కోసం అధికారులు భూసేకరణ చేపట్టారు. ఎల్గోయి గ్రామంలో దాదాపు మూడు వేల ఎకరాల భూమిని ప్రాజెక్టు కింద తీసుకున్నారు. భూములు కోల్పోయిన బాధిత కుటుంబానికి ఇంటికొక ఉద్యోగం, ప్లాటు కేటాయించాలని గతంలో నిమ్జ్ అధికారులను కోరారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం ప్రారంభోత్సవానికి వచ్చిన మాజీ మంత్రి హరీశ్‌రావుకు భూములు కోల్పోయిన బాధితుల ఇంటి నిర్మాణాలు, సామూహిక భవనాలు, గ్రంథాలయం తదితర అవసరాల కోసం భూమిని కేటాయించాలని గ్రామస్తులు విన్నవించారు. వెంటనే స్పందించిన హరీశ్‌రావు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు సభాముఖంగా ఆదేశాలిచ్చారు. వారం రోజుల్లోనే రెవెన్యూ, టీఎస్ఐఐసీ బృందం సర్వే నిర్వహించాయి. ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన క్రమంలో గ్రామంలోని 125 సర్వే నెంబర్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల పక్కన భూ బాధితులు, ఇండ్లులేని పేదకుటుంబాలు రేకుల షెడ్లు, ఇండ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. వారికి ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా శనివారం తెల్లవారుజామున నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్ రాధాబాయి, టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ అనురాధ, స్థానిక తహసీల్దార్ సంజీవరావు, నయాబ్ తహసీల్దార్ యాసిన్, గిర్దవార్ రామారావు రేకుల షెడ్లు, ఇండ్ల ప్రహరీలను నాలుగు జేసీబీలతో కూల్చివేశారు. జహీరాబాద్ సీఐ వెంకటేశం ఆధ్వర్యంలో గ్రామం నలువైపులా పోలీసు బలగాలను మోహరించి ఎక్కడివారినక్కడ చెల్లాచెదురు చేశారు. భారీగా పోలీసులు గ్రామాన్ని చుట్టుముట్టడంతో గ్రామస్తులంతా భయాందోళనకు గురయ్యారు.

**బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే**

ఎల్గోయి గ్రామంలో రేకుల షెడ్లు, ఇండ్ల ప్రహరీలు కూల్చివేయడంతో బాధితులను జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, స్థానిక నాయకులతో కలిసి పరామర్శించి కూల్చివేతలను పరిశీలించారు. అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఆదేశించినప్పటికీ, వాటిని పరిశీలించకుండా కొత్త ప్రభుత్వం రాగానే ఇలా చేయడం సరికాదన్నారు. బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీడీసీ మాజీ చైర్మన్ ఉమాకాంత్‌పాటిల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశం, గ్రామ సర్పంచ్ ఓం ప్రకాశ్‌పాటిల్, నాయకులు బండి మోహన్, రమేశ్, అశోక్, విఠల్, బాల్‌రాజ్, మారుతి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# దేశానికి పట్టుకొమ్మలు పల్లెలు

- మంత్రి పొన్నం ప్రభాకర్
- మర్కూక్ మండలం పాములపర్తిలో గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం



మర్కూక్ మండలం పాములపర్తిలో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

మర్కూక్, జనవరి 27: దేశానికి పట్టుకొమ్మలు గ్రామ పంచాయతీలు అని, గ్రామాల అభివృద్ధికి కృషిచేస్తామని రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మర్కూక్ మండల పరిధిలోని పాములపర్తిలో శనివారం రాత్రి రూ.30లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. సర్పంచ్‌ల పదవీకాలం పొడిగించేందుకు అవకాశం లేనందున ప్రత్యేకాధికారుల పాలన తీసుకొస్తామన్నారు. ఐదేండ్ల పాటు గ్రామాల అభివృద్ధికి కృషి చేసిన సర్పంచ్‌కు అభినందనలు తెలిపారు. సర్పంచ్‌ల పెండింగ్ బిల్లుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కొండపోచమ్మ ప్రాజెక్టు దగ్గరలోనే ఉండడంతో తాగు నీటి సమస్య ఉండదన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంకును ప్రారంభించారు. గ్రామాల అభివృద్ధికి రూ.30లక్షలు మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. కార్యక్రమంలో సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఆర్డీవో బన్సీలాల్, ఎంపీపీ పాండుగౌడ్, డీపీవో దేవకీదేవీ, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, సర్పంచ్ తిరుమల్‌రెడ్డి, కార్యదర్శి ప్రవీణ్, నాయకుడు కనకయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మట్కా స్థావరాలపై దాడులు



జహీరాబాద్‌లో అదుపులోకి తీసుకున్న మట్కా నిర్వాహకులను చూపిస్తున్న పోలీసులు

- పోలీసుల అదుపులో ఆరుగురు నిర్వాహకులు
- రూ. 1,43,500 నగదు సీజ్
- జహీరాబాద్ పట్టణం, రంజోల్‌లో తనిఖీలు

**నమస్తే తెలంగాణ ఎఫెక్ట్**

జహీరాబాద్, జనవరి 27: జహీరాబాద్ పట్టణంతో పాటు వివిధ గ్రామాల్లో మట్కా నిర్వాహకులపై జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 25న 'నమస్తే తెలంగాణ'లో 'సరిహద్దు పల్లెల్లో జోరుగా మట్కా' అనే వార్త ప్రచురితమైంది. శనివారం ఉదయం జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు రెండు బృందాలు జహీరాబాద్ పరిధిలోని వివిధ గ్రామాల్లో తనిఖీలు నిర్వహించి 6 మందిని అదుపులోకి తీసుకుని రూ. 1,43,500 నగదును సీజ్ చేశారు. రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని రంజోల్ గ్రామంలో మట్కా నిర్వహిస్తున్న కృష్ణ(40), కంటి రవి (38), కంటి రాజు(49), చిలకపల్లి చంద్రయ్య(49), పట్టణంలోని సుభాశ్‌గంజ్‌లో బోయిని నర్సిములు(40), కూరేశ్ యాదుల్(40)లను అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం జహీరాబాద్ పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్లకు తరలించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# న్యాల్‌కల్ మండలంలో భూకంపం

- ఒకటి, రెండు సెకన్ల పాటు కంపించిన భూమి
- ఇండ్ల నుంచి పరుగులు తీసిన ప్రజలు

న్యాల్‌కల్, జనవరి 27: సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలో భూకంపం సంభవించింది. ముంగి, న్యాల్‌కల్, టేకూర్, మిర్జాపూర్(ఎన్), అత్నూర్, డప్పూర్, మల్గి తదితర గ్రామాల్లో శనివారం సాయంత్రం నాలుగున్నర సమయంలో ఒకటి, రెండు సెకన్ల స్వల్ప వ్యవధిపాటు భారీ శబ్దంతో భూమి కంపించిందని స్థానికులు తెలిపారు. ఆందోళనకు గురైన ప్రజలు ఇండ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని తహసీల్దార్ భానుకిరణ్, డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి తెలిపారు.



న్యాల్‌కల్ మండలం ముంగి గ్రామంలో ఇండ్ల నుంచి బయటకు వచ్చిన మహిళలు

# కర్ధనూర్‌ను అభివృద్ధి చేస్తాం

**పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు/జిన్నారం, జనవరి 27: కర్ధనూర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పటాన్‌చెరు మండలం కర్ధనూర్ గ్రామంలో రూ. కోటి 14 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కర్ధనూర్ గ్రామాన్ని రాష్ట్రస్థాయిలో ఉత్తమ పంచాయతీగా అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుష్మాశ్రీవేణుగోపాల్‌రెడ్డి, జడ్పీటీసీ సుప్రజా వెంకట్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ భాగ్యలక్ష్మీసత్యనారాయణ, ఎంపీటీసీ నాగజ్యోతీలక్ష్మణ్, పంచాయతీరాజ్ డీఈ సురేశ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు పాండు, ఉప సర్పంచ్ వడ్డే కుమార్ పాల్గొన్నారు.

**రైతులకు అండగా ఉంటా..**

రైతులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పటాన్‌చెరు మండలం ముత్తంగిలో రూ. 60లక్షలతో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉపేందర్‌ముదిరాజ్, మాజీ జడ్పీటీసీ గడీల శ్రీకాంత్‌గౌడ్, వైస్ ఎంపీపీ స్వప్నశ్రీనివాస్, పీఏసీఎస్ అధ్యక్షుడు భిక్షపతి, రామకృష్ణముదిరాజ్ పాల్గొన్నారు. జిన్నారం మండలం లక్ష్మీపతిగూడెంలో ఫిబ్రవరి 22న జరిగే ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహం ప్రతిష్ఠ కరపత్రాన్ని జడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, సర్పంచ్ లావణ్యాజీవన్, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే తన నివాసంలో ఆవిష్కరించారు.


దశదిన కర్మ



మంచికి మానవత్వానికి మారుపేరుగా ఉన్నతమైన వ్యక్తిగా అందరి హృదయాలను గెలిచిన మృదు స్వభావి అయిన మీ ఆకస్మిక మరణం మాకు ఎంతో బాధను కలిగించినది. మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ...

శోకతప్త హృదయాలతో..

కీ॥శే॥ అంబారి రాములు గారు
మాజీ ఎంపిపి, పటాన్ చెరు
ఉమ్మడి మెదక్ జిల్లా కురుమ సంఘం మాజీ అధ్యక్షులు
మరణం: 18.01.2024

భార్య : అంబారి కిష్టమ్మ
మాజీ ఎంపిటిసి, భానూర్

కొడుకులు-కోడళ్ళు:
ఎ. యాదగిరి - విజయలక్ష్మి
ఎ. శ్రీనివాస్ - మల్లేశ్వరి
ఎ. భాస్కర్ - చందన

కూతుళ్ళు - అల్లుళ్ళు:
ఎన్. విజయలక్ష్మి - జంగయ్య
పి. సువర్ణ - శ్రీశైలం
మాజీ సర్పంచ్ - మాజీ సర్పంచ్ పెద్దాపూర్

మనుమండ్లు, మనుమరాండ్లు, బంధు మిత్రులు మరియు అంబారి వారి కుటుంబ సభ్యులు

దిన కర్మ: తేది: 28.01.2024న ఆదివారం రోజున మ. 12.00 గం.లకు లైఫ్‌స్టైల్ డ్రీమ్ హోమ్స్, క్లబ్ హౌస్, భానూరు, మం. పటాన్‌చెరు.
సెల్: 8985894665, 8985271845, 9533014448